క్లుప్తంగా

గుంటి గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న గుంటి గంగమ్మ తల్లి

తాళ్లూరు: మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం గుంటి గంగా భవాని అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకాలు, అష్టోత్తర శతనామావలి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ఆలయ అర్చకులు పి.విజయలక్ష్మి, ఎం.బాలరాజు, కామేశ్వరశర్మ పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ పి.కార్తీక్, ఆర్‌పీ కె.ప్రసాద్‌రావు, ఆలయ చైర్మన్ కె.గురుబ్రహ్మం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలేరమ్మకు నెల పొంగళ్లు


పూజలందుకుంటున్న పోలేరమ్మ తల్లి

ముండ్లమూరు(దర్శి): మండలంలోని పులిపాడు గ్రామంలో పోలేరమ్మ అమ్మవారికి నెల పొంగళ్ల కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ప్రారంభమైన నేపథ్యంలో ఆదివారం గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. అమ్మవారికి గ్రామంలో భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుద్దేటి నారాయణ రెడ్డి, లక్కిరెడ్డి కోటిరెడ్డి, ముక్కామల రమణా రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'కారుమూరి'ని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు


కారుమూరితో వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఆ పార్టీ దర్శి నాయకులు ఆదివారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధిపై చర్చించారు. కారుమూరిని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, దర్శి మండల పార్టీ అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, తాళ్లూరు మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి ఉన్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


దర్శనమిస్తున్న పోలేరమ్మ అమ్మవారు


కాలేజీ రోడ్డులో పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని నాగశిలలు, పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే పట్టణంలోని ఎస్వీకేపీ కళాశాల రోడ్డులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాకతీయ సేవాసమితి నూతన కమిటీ ఎన్నిక

కంభం: కాకతీయ సేవాసమితి గిద్దలూరు నియోజకవర్గ నూతన కమిటీని ఆదివారం కంభంలో బైరపనేని అధ్యక్షతన ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావూరి వెంకటసుబ్బయ్య, గౌరవ అధ్యక్షుడిగా పోకా చిన్న ఈశ్వరయ్య, కార్యదర్శిగా బోయపాటి వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా కర్నం లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా ఇప్పర్ల వెంకట సత్యనారాయణ, కోశాధికారిగా కర్నం బాల కోటయ్య, మరికొందరు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ నెల 24న ఆదివారం కంభం చెరువుకట్టపై కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేయనున్నట్లు నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

ఉల్లి రైతుల కంట కన్నీరు


పెద్దారవీడులో వర్షానికి తడిసిన ఉల్లి పంట


వర్షానికి తడిసి కుళ్లిపోయిన ఉల్లిగడ్డలను చూపిస్తున్న రైతు నాగులమీరా

- నష్టాల బాటలో ఉల్లి రైతులు
- వర్షాలకు తడిసి దెబ్బతిన్న ఉల్లిగడ్డలు
- ధరలు దిగ్గోసిన వ్యాపారులు

పెద్దారవీడు: ఈ ఏడాది ఉల్లి పంటపై రైతులు పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. పంటలపై తుఫాన్ ప్రభావం చూపడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దాదాపు 10 రోజుల క్రితం కురిసిన వర్షాలకు ఉల్లిగడ్డలు దెబ్బతినడంతో రైతులకు కోలుకోని దెబ్బ తగిలింది. నియోజకవర్గంలో పెద్దారవీడు, త్రిపురాంతకం మండలం నడిగడ్డ, యర్రగొండపాలెం మండలం గురిజేపల్లి, బోయిలపల్లి గ్రామాల్లో దాదాపు 250 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. చేతికి వచ్చే సమయంలో పాడైపోవడంతో రైతుల కష్టమంతా నీటిపాలైంది. వర్షాల అనంతరం మార్కెట్లో ఉల్లి ధరలు తగ్గిపోయాయి. ఉల్లి సాగు పంట కాలం పూర్తయినా వర్షాలతో రైతులు ఉల్లిగడ్డలు పీకలేకపోయారు. వర్షాల అనంతరం ఉల్లి గడ్డలు దెబ్బతింటాయనే ఉద్దేశంతో కొంత మంది రైతులు పీకి వేశారు. ఉల్లిగడ్డలు అమ్మినా కోసే కూలీ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉంది. దానికి తోడు బయట మార్కెట్లో ఉల్లి ధరలు పడిపోవడంతో రైతుల కంట కన్నీరు తెప్పిస్తోంది. ఉల్లి గడ్డలు పీకే సమయంలో వర్షం కురవడంతో పొలంలోనే గడ్డలు నీటిలో కుళ్లిపోవడంతో నిరాశ చెందారు. వర్షాల కంటే ముందు 80 నుంచి 100 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని ఆశించారు. వర్షాల అనంతరం ఉల్లి దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రస్తుతం మొదటి రకం క్వింటా రూ.1500 కూడా వ్యాపారస్తులు అడగడంలేదని రైతులు వాపోతున్నారు. ఈ ధరలతో కూలీల ఖర్చులు కూడా రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు ఉల్లి సాగు మొదలు నారు నాటడం, కలుపు తీత, ఎరువులు, సకాలంలో మందులు పిచికారీ చేయడానికి దాదాపు రూ.70 వేల నుంచి రూ.80 వేలు పెట్టుబడులు పెట్టారు. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని అగమ్యగోచరంగా ఉన్నామని రైతులు తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ఇంకా పొలాల్లో పర్యటించలేదని రైతులు చెబుతున్నారు. ఆర్థికంగా చాలా నష్టపోయామని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఉల్లి పంట సాగు చేసిన రైతులు కోరుతున్నారు.

సాగులో తీవ్రంగా నష్టపోయాం

ఉల్లి సాగులో ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయాం. ఒక ఎకరంలో ఉల్లి పంట సాగు చేశాను. పెట్టుబడి దాదాపు రూ.70 వేలకు పైగా పెట్టాను. దాదాపు 10 రోజుల క్రితం పడిన వర్షాలకు పంట తడిసిపోయి ఉల్లిగడ్డలు కుళ్లిపోయాయి. మరో రెండు రోజుల్లో గడ్డలు పీకుదామని కూలీలను సిద్ధం చేసుకున్నాను. పీకాలన్నా కొనుగోళ్లకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. ఉల్లి గడ్డలను ఎలా అమ్ముకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. అధికారులచేత పంట నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– దూదేకుల నాగులమీరా, పెద్దారవీడు

బాలికల వసతి గృహానికి గ్రహణం

- ఏళ్ల తరబడి సాగుతున్న నిర్మాణాలు
- విద్యార్థినుల అవస్థలు


పుల్లలచెరువులో ముళ్ల పొదల మధ్య దిష్టి బొమ్మలా ఉన్న బాలిక విద్యార్థుల వసతి గృహం

పుల్లలచెరువు:

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికల కోసం మండల కేంద్రంలో సుమారు రూ.2 కోట్లతో ప్రత్యేక వసతి గృహాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. కానీ ఈ భవన నిర్మాణ పనులు ఏళ్ల తరబడి చేస్తున్నారు. దాదాపు ఆరేళ్లుగా ఈ భవన నిర్మాణ పనులు సాగుతున్నాయంటే అధికారులు ఎంత శ్రద్ధగా పనిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రాంతంలో వలస వెళ్లి పనులు చేసుకుని జీవనం సాగించే వారు ఎక్కువ. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం వలస వెళ్తే వారి పిల్లల చదువులు మధ్యలోనే మానేస్తున్నారు. అటువంటి వారి కోసమే దీనిని ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. మండల కేంద్రంలో బాలికల కోసం కేజీబీవీ బాలికల పాఠశాల ఉన్నా అందులో ఆన్‌లైన్ ప్రవేశాలు పొందాల్సి ఉంది. అందులో సీటు రావచ్చు రాకపోవచ్చు. కానీ స్థానికంగా సమీప గ్రామంలోని వారు, మండల కేంద్రంలో నివసించే వారి పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఈ వసతి గృహంలో విద్యార్థినులు ప్రవేశం పొందడం సులువు. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసి విద్యార్థినుల కష్టాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ పాఠశాలతో ఎంతో మేలు

మా పాలెంలో చాలా కుటుంబాలు బతుకుదెరువు కోసం సంవత్సరానికి నాలుగు నెలలు వలస వెళ్లి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారు. వారు వెళ్తే పిల్లలను ముసలి వారి వద్ద వదలి వెళ్లాల్సిన పరిస్థితి. అదే పాఠశాల వసతి గృహం తెరిచి ఉంటే బాలికలకు ఎంతో మేలు జరుగుతుంది.

– మరియదాసు, ఎస్సీ పాలెం, పుల్లలచెరువు

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక


అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకుంటున్న యూటీఎఫ్ నాయకులు

దర్శి: దర్శి మండలం యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులుగా మీనిగ శ్రీను, పి.ఖాసీంను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల సమావేశ హాల్లో మీనిగ శ్రీను అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు, సహాధ్యక్షులు ఎస్‌కే అబ్దుల్ హై, జిల్లా కార్యదర్శి ధనిరెడ్డి వెంకటరెడ్డి, టిరాజశేఖర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.యలమందారెడ్డి, సహాధ్యక్షులుగా ఎల్ఆర్ స్రవంతి, ఎ.రామారావు, కోశాధికారి రామారావు, మహిళా కార్యదర్శిగా వైవీ రాజేశ్వరి, మండల కార్యదర్శులుగా నరసింహం, పీ శ్రీనివాసరావు, ఎం.రమణారెడ్డి, ఆర్.బాజీ వలి, ఎం.తిరుపతిరెడ్డి, కె.రోశయ్య, పి.వెంకటేశ్వర్లు, ఈ.నాగిరెడ్డి, జె.రవికుమార్, కె.విజయభాస్కర్, మహిళా కమిటీ కన్వీనర్ బీ ఆరుణకుమారి, జె.మస్తాన్‌బి, ఆడిట్ కమిటీ సభ్యురాలిగా బి.రామాంజనేయులు, సాస్కృతిక కమిటీలో వై రవికుమార్, ఎ.భ్రమరాంబదేవి, సీపీఎస్ కన్వీనర్లుగా పి.చిన్నా, మహబూబ్, కో కన్వీనర్‌గా ఎస్‌కే మస్తాన్‌వలి, కుటుంబ సంక్షేమం కన్వీనర్ బి.భాస్కర్‌రెడ్డి, కోకన్వీనర్ కేవీ సుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ప్రభుత్వం యాప్‌ల భారం తగ్గించి విద్యార్థుల చదువుకు ఉపయోగపడేలా తీర్మానాలు చేయాలన్నారు. ఓపీఎస్ విధానాన్ని ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ తీర్మానం చేశారు. ఎన్నికల పరిశీలకుడిగా జి.కోటేశ్వరరావు వ్యవహరించారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


ప్రత్యేక పూజల్లో ఉభయదాతలు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఉభయదాతలు సోమిశెట్టి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు మేళతాళాలతో ఆహ్వానించారు. ఆలయ పూజారులు దీవి శ్రీకాంత్ భట్టర్, మురళీకృష్ణామాచార్యులు పూజలు, హోమాలు చేయించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు శ్రావణి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు యక్కలి శేషగిరిరావు, కార్యదర్శి పి.భాస్కర్, కోశాధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మెరక


దర్శి పోలీస్‌స్టేషన్ ఎదుట మట్టి తోలిన దృశ్యం


ప్రభుత్వ కార్యాలయాల వద్ద చిత్తడి

'సాక్షి'లో ప్రచురించిన కథనం

సాక్షి ఎఫెక్ట్..

దర్శి: 'ప్రభుత్వ కార్యాలయం వద్ద చిత్తడి' పేరుతో గత నెల 25వ తేదీన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. కార్యాలయం ఎదుట మట్టి తోలి చదును చేశారు. గతంలో వర్షాలకు పోలీస్‌స్టేషన్, రెవెన్యూ కార్యాలయంలోకి రావాలంటే వర్షాలకు గుంటలు పడి నీరు నిలిచి చిత్తడి చిత్తడిగా ఉండేది. ప్రస్తుతం మట్టి తోలడంతో కార్యాలయం ఆవరణ పరిశుభ్రంగా మారింది.

ఘనంగా వీర నరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం


పొంగళ్లు పెడుతున్న భక్తులు


పూజలందుకుంటున్న వీర నరసింహస్వామి

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామంలో స్వయంభు వీరనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు వెలమకన్ని వెంకట హనుమత్ కళ్యాణ్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కొండపై స్వామివారికి పొంగళ్లు పెట్టి నివేదన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా అభయ అంజనేయ, అయ్యప్పస్వామి మాలధారులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. మాలధారులకు గిరిమాజీ వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి కుటుంబ సభ్యులు భిక్ష అందించారు.

గురుస్వాములు కనకచార్యులు, ఎన్.సింగరయ్య, ఎం.బాలకృష్ణ, యల్లా రంగస్వామి, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రాజంపల్లి తారురోడ్డు


చట్లమిట్ల నుంచి రాజంపల్లి గ్రామానికి వెళ్లే తారురోడ్డుపై గుంత

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల నుంచి రాజంపల్లి తారురోడ్డు అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు తారురోడ్డుపై గుంతలు పడడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం రోడ్లు బాగు చేస్తామని చెప్పడం తప్ప ఇప్పటి వరకు రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురవడంతో గోతుల్లో నీరు చేరడంతో రాత్రిపూట ద్విచక్ర వాహనదారులకు సరిగ్గా కనిపించక కింద పడిన సంఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. రాజంపల్లి నుంచి చట్లమిట్ల గ్రామంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు వాహనాలపై వెళ్లాలంటే అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఈ రహదారిపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేనూతల కాటమరాజుస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలో గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామ సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు సమర్పించారు. నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో మహిళలు నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు.

దూదేకుల సంఘ మండల అధ్యక్షునిగా దర్గయ్య


దర్గయ్యను అభినందిస్తున్న జిల్లా ప్రతినిధులు

పెద్దదోర్నాల: నూర్ బాషా దూదేకుల సంఘం మండల అధ్యక్షునిగా మండలానికి చెందిన దూదేకుల దర్గయ్య ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన నూర్‌బాషా దూదేకుల సమావేశంలో జిల్లా ప్రతినిధులు పాల్గొని మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షునిగా దూదేకుల దర్గయ్య, ప్రధాన కార్యదర్శిగా దూదేకుల కాశయ్య, కోశాధికారిగా దూదేకుల ఖాసింవలి, ఉపాధ్యక్షునిగా దూదేకుల మౌలాలితో పాటు పలువురు సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దూదేకుల దర్గయ్యను పలువురు అభినందించారు. కార్యక్రమంలో నూర్ బాషా దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మీరావలి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు. దర్గయ్య మాట్లాడుతూ నూర్ బాషా దూదేకుల సంక్షేమానికి నిరంతరం పాటు పడతానని తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగ పోటీలకు ముటుకుల విద్యార్థి


యోగ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పుల్లలచెరువు: త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి యోగ పోటీలకు ముటుకుల సిద్ధార్థ ఉన్నత పాఠశాలకు చెందిన కె. వినోద్‌రెడ్డి ఎంపికైనట్లు స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 14–17 క్యాటగిరి యోగా ఛాంపియన్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో జరిగే ఛాంపియన్ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థి వినోద్‌రెడ్డిని డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్స్‌పాల్ టి.అంజిరెడ్డి, వైస్ ప్రిన్స్‌పాల్ శివారెడ్డి, పీడీలు మహేశ్వరరెడ్డి, నరసింహనాయక్, ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఈఓల అవినీతిపై విచారణేది?

- విద్యాశాఖ తీరుపై మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

కురిచేడు: మండల విద్యాశాఖాధికారుల అవినీతిపై గత నెల 22వ తేదీ కరపత్రాలు కలకలం రేపాయి. వాటిపై పలు పత్రికలు, సోషల్‌మీడియాలో కథనాలు రావడంతో మరింత చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాలు గతనెల 26వ తేదీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి మండల విద్యాశాఖ అధికారుల అవినీతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశాయి. అయితే ఇప్పటికీ జిల్లా విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. ఎంఈఓల అవినీతిపై విచారణలో జాప్యం వెనుక ఉన్నతాధికారుల హస్తం ఉందనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కరపత్రాలు వేసిన వారిని గుర్తించి అందుకు గల కారణాలు తేల్చకపోవడం, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టకపోవడం తమ అనుమానాలకు బలాన్నిస్తోందని ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అవినీతి ఆరోపణలపై విచారణ చేపడతారో లేదో వేచిచూడాల్సిందే.


ఎంఈఓ అవినీతిపై కరపత్రం కలకలం..

ఎంఈఓలపై వచ్చిన కరపత్రాలు

కురిచేడు: మండల విద్యాశాఖ అధికారి అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ కరపత్రాలు ప్రచురించడం మండలంలో కలకలం రేపింది. మంగళవారం ఉదయం నుంచి ఆ కరపత్రం మండలం

ఎంఈఓల అవినీతిపై కలకలం రేపిన కరపత్రాల కథనం

పంచాయతీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ

కంభం: కందులాపురం పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు ఆదివారం భూతపాటి బ్రదర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు దానియేలు మాట్లాడుతూ.. సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.